# ఇది ప్రతీకారమా ?

అది 1981 నవంబరు 23వ తేదీ. కలకత్తాలోని ఒకానొక హౌసింగ్ కాంప్లెక్సు. కరెంటు లోడ్ లేనందున ఆరోజు రాత్రి 9-30 గంటలకు ఆ ప్రాంతం అంతా అంధకారం చుట్టివేసింది. ఎముకలు కొరికే చలి. కరెంటు పోగానే ఆ కాంప్లెక్సు గేటుకు తాళం వేశాడు గూర్ఖా.

సరిగ్గా పన్నెండున్నరకు కరెంటు వచ్చింది. ఒక్కసారిగా వెలిగిన దీపాల కాంతిలో ఆ కాంప్లెక్సు మెరిసిపోతున్నది. అప్పటికి ఫ్లాట్స్‌లో ఉన్నవాళ్ళు చాలా వరకు నిద్రపోయారు.

పన్నెండున్నరకు ఒక కారు వచ్చి గేటు ముందు ఆగింది. గూర్ఖా లేచి తాళం తీశాడు. కారు కాంప్లెక్సుకు ఓ ప్రక్కగా పార్కు చేసి, కారు తాలూకు వ్యక్తి ఫ్లాట్స్‌లోకి వెళ్ళాడు. అతను నాలుగవ అంతస్థులో ఉండే బెనర్జీ అని గూర్ఖాకు తెలుసును.

బెనర్జీ లిఫ్ట్‌లో తన ఫ్లాట్‌కు వెళ్ళి కాలింగ్ బెల్ నొక్కాడు. ఎన్ని సార్లు నొక్కినా తలుపు తెరుచుకోలేదు. బెనర్జీకి ఆశ్చర్యం, భయం కలిగాయి. తన భార్య ఎప్పుడూ ఒక్కసారి బెల్ కొడితే చాలు వెంటనే తలుపు తెరుస్తుంది. ఇవ్వాళ ఏమైంది? ఆలోచనలో పడ్డాడు బెనర్జీ.

తలుపుకి ఆటోమేటిక్ లాక్ వుంది. దానికి సంబంధించిన డూప్లికేట్ బెనర్జీ దగ్గరే ఉంటుంది. లాక్ తీసి లోపలికి వెళ్ళాడు. భార్య

వున్న అలికిడి లేదు. బెడ్‌రూం తలుపులు నెట్టాడు. ఎదురుగా భయంకర దృశ్యం - బెనర్జీ కొద్ది క్షణాలు శిలాప్రతిమలా నిలబడిపోయాడు. మరు క్షణం కెవ్వున అరిచాడు. గిర్రున తిరిగి బయటకు పరుగు తీశాడు. పక్క ఫ్లాటు తలుపు తట్టాడు. ఆ ఫ్లాటు యజమాని గుప్తా తలుపు తెరిచి అర్థరాత్రి తన తలుపును తట్టిన బెనర్జీని/చూసి ఆశ్చర్యపోయాడు.

బెనర్జీ నిలువెల్లా వణికి పోయాడు.

''ఏమైంది?"

"నా.... నా... "

"ఏమైందండి"

''నా....మిసెస్.... సీలింగ్ ఫాన్‌కు"అంటూ బావురు మన్నాడు.

గుప్తాకు అర్థమయ్యింది. ''అదేమిటి? తొమ్మిట, తొమ్మిది న్నరకు వాకిట్లో నిల్చుని నా భార్యతో మాట్లాడిందే?'' అన్నాడు ఆశ్చ ర్యంగా.

ఏడుస్తున్న బెనర్జీ భుజం తడుతూ "నేను నమ్మలేకుండా ఉన్నాను. పదండి" అంటూ ముందుకు నడిచాడు గుప్తా.

సీలింగ్ ఫాన్‌కు చీరతో ఉరి వేసుకున్న రేఖ శవం గది మధ్య వేలాడుతూ కన్పించింది. ఆ పక్కగా గాడ్రేజ్ చైర్ తల క్రిందులుగా పడి వుంది.

గుప్తా ఇరుగు పొరుగు వాళ్ళను కేకలుపెట్టి పిల్చాడు. పోలీస్ స్టేషన్‌కు ఫోన్ చేసాడు. ఇన్‌స్పెక్టర్ అశోక్ ఇద్దరు కానిస్టేబుల్స్‌తో వచ్చాడు. పాండ్సు పౌడర్ డబ్బా కింద ఓ కాగితం కన్పించింది. ఇన్‌స్పెక్టర్ ఆ ఉత్తరం తీసి చదివాడు. ఆ తర్వాత బెనర్జీకి ఇచ్చి చదవమన్నాడు. అందులో---

"ప్రియమైన నా స్వామి!

నా ఆత్మ హత్యకు మీరు ఎంత కుంగిపోతారో అంత ఆశ్చర్య పోతారని నాకు తెలుసు. కారణం మీ దృష్టికి నేను ఆత్మ హత్య చేసు కోవాల్సిన అవసరం కన్పించక పోవడమే. మానవ మనసును తెలుసు కున్నాననుకోవడం పొరపాటు. ఎవరు ఎవర్నీ, ఎంత దగ్గరగా వున్నా పూర్తిగా అర్థం చేసుకోవడం సాధ్యం కాదు. మీతో చాలా ఆనందంగా జీవితం గడిపాను. కాని భవిష్యత్తు గురించిన ఆలోచనరాగానే నాలో నేను ఎంత వ్యధకు గురి అయ్యానో మీరు అర్థం చేసుకోలేరు. మీతో నా ఇష్టానికి విరుద్ధంగా నా పెళ్లి జరిగింది. నాకు డాక్టర్ కావాలని పెద్ద కోరిక. ఈ వివాహం వలన ఆ కోరికకు తిలోదకాలు ఇవ్వాల్సి వచ్చింది. ఫస్ట్ క్లాసులో ఫస్ట్‌ని పాసయిన నా జీవితం వంటింటికి బంధించబడింది. ఈ జీవితంతో రాజీ పడలేక వెళ్లిపోతున్నాను. నా ఈ ఆత్మహత్యకు ఎవరూ బాధ్యులు కారు. మీరు ఒక ఆదర్శ భర్త కాగలిగారు. కాని నేను ప్రయత్నించి కూడా నిజాయితీతో మీతో ఆనందాన్ని పంచుకోలేకపోయాను. అందుకే వెళ్లిపోతున్నాను.

మీ అభాగ్యురాలైన భార్య

రేఖ''

అని రాసి వుంది.

బెనర్జీ ఉత్తరం చదివాక నోట మాట రాలేదు. నిర్జీవంగా వుండి పోయాడు. ఇన్‌స్పెక్టర్ అశోక్ ఇరుగు పొరుగు వాళ్ళ స్టేట్‌మెంట్స్ తీసుకున్నాడు. అందరూ ఆ భార్యా భర్తలది అనుకూల దాంపత్యమే అని చెప్పారు. రేఖ అలా చనిపోవడాన్ని తాము నమ్మలేకుండా ఉన్నామన్నారు.

ఆ తర్వాత అశోక్ బెనర్జీని వివరాలు అడిగాడు.

"ఇన్‌స్పెక్టర్ గారూ! రెండు నెలల క్రితమే రేఖతో నావివాహం జరిగింది. ఆమెకు డాక్టర్ చదవాలని వున్నదని నాతో చెప్పింది. నేను అందుకు ప్రోత్సహించాను. కాని ఆమే స్వయంగా తనకు చదవాలని లేదని, ఈ జీవితమే తనకు పూర్తి సంతృప్తి నిస్తోందనీ చెప్పింది. అలాగే కన్పించేది నాకు. ఆమె ఆత్మహత్య చేసుకున్నదంటే నమ్మాలని అన్పించడం లేదు." అని బెనర్జీ వెక్కి వెక్కి ఏడవ సాగాడు.

"మీ అలవాట్ల గురించి చెబుతారా?"

"నాకు వేరే అలవాట్లు ఏమీ లేవు. వారానికి మూడు సార్లు క్లబ్బుకు వెళతాను. ఆ మూడు రోజులు మాత్రం ఇంటికి వచ్చేసరికి పన్నెండున్నర అవుతుంది. ఆ విషయం రేఖకు తెలుసు. అమె ఎప్పుడూ ఈ విషయంలో అయిష్టాన్ని కనబర్చలేదు. ఇవ్వాళ అలాగే వచ్చాను. తీరా వచ్చాక. ..ఆపైకి మాట రాలేదు.''

ఇన్‌స్పెక్టర్‌కు ఎక్కడా క్లూ దొరకలేదు. గేటులో వుండే గూర్ఖాను పిలిచి వాకబు చేశాడు.

"సాబ్! నేను పన్నెండేళ్ళుగా ఇక్కడ ఉంటున్నాను. ఈ ఫ్లాటులో వుండేవాళ్ళంతా నాకు బాగా తెలుసు. ఈరోజు తొమ్మిదిన్నరకు కరెంటు పోయింది. అందుకే గేటుకు తాళం వేశాను. పది గంటలకు ఓ యువకుడు వచ్చాడు. అతను ఏడో అంతస్తుకు పోవాలన్నాడు. నేను తాళం తీశాను. అతను లోపలకు వెళ్ళాడు. మళ్ళీ తాళం వేసి కూర్చున్నాను. దాదాపు పదకొండు అవుతుండగా ఆ యువకుడు బయటికి వెళ్ళిపోయాడు. పన్నెండున్నరకు బెనర్జీ సాబ్ వచ్చాడు.''

ఇన్‌స్పెక్టర్ ముఖం వికసించింది.

"ఆ యువకుడ్ని నువ్వు గుర్తు పట్టగలవా? ఎలా వుంటాడు?"

"చాలా అందంగా వున్నాడు. పొడుగ్గా వున్నాడు. మీరు అతన్ని చూపిస్తే గుర్తు పట్టగలను."

"అంతకు ముందు ఎప్పుడూ చూడలేదా?"

"లేదు"

దీనివల్ల ఇన్‌స్పెక్టర్‌కు దొరికినట్లే దొరికి అంతలోకే 'క్లూ' జారి పోయింది.

ఉత్తరాన్ని ఆమె దస్తూరి అవునో కాదో తెలుసుకోవడానికి నిపుణిడి దగ్గరకు పంపించారు.

శవ పరీక్షలో, అది ఆత్మహత్య కాదనీ, గొంతు పిసికి చంపి, ఆ తర్వాత ఫ్యాన్‌కు వేలాడదీయబడిందని తేలింది. హంతకుడు గూర్ఖా వర్ణించిన వ్యక్తేనని కూడా నిర్ధారించడం జరిగింది. హత్య కూడా పదీ-పదకొండు మధ్య జరిగినట్టు రిపోర్టులో రాయబడింది.

కాని ఆ యువకుడు ఎవరో మాత్రం ఎన్ని ప్రయత్నాలు చేసినా ఆచూకీ తెలియలేదు. రేఖ పుట్టింటి వాళ్ళు కూడా రేఖది ఆత్మహత్య చేసుకోనే మనస్తత్వం కాదనీ, తన భర్త అంటే చాలా ఇష్టం అని చెప్పారు.

దస్తూరి పరీక్షలో రేఖ అంతకు ముందు రాసిన ఉత్తరాలు, చనిపోతూ రాసిన ఉత్తరం ఒక్కరు రాసినవి కావని తెలిసింది. అంటే ఆ ఉత్తరం హంతకుడే రాసి పెట్టాడని తేలిపోయింది. అయినా హంతకుడి జాడ తెలియలేదు.

డిసెంబరు 3వ తేదీన ఒక యువకుడు ఇన్‌స్పెక్టర్ అశోక్ దగ్గరకు వచ్చాడు. అతని తల రేగి వుంది. బట్టలు మురిగ్గా చిరిగిపోయి వున్నాయి. ముఖం పీక్కుపోయింది. అయినా ఎంతో అందంగా వున్నాడు. అతడి వయసు 25 సంవత్సరాలు.

ఇన్‌స్పెక్టర్ కూర్చోమని చెప్పకముందే కుర్చీ లాక్కుని కూర్చున్న ఆ యువకుడ్ని తీక్షణంగా చూశాడు. ''ఎవరు నువ్వు? ఏం కావాలి?''

"నేను రేఖ ఆత్మహత్య గురించి . . ."

''ఏమిటీ?" ఇన్‌స్పెక్టర్ అశోక్ ఒక్కసారిగా కుర్చీలో ఇంతెత్తున ఎగిరిపడ్డాడు.

''నేనే ఆమెను హత్య చేశాను."

అశోక్ కళ్ళు పెద్దవిగా చేసుకొని ఆశ్చర్యంగా చూశాడు.

ఆ యువకుడు తన ధోరణిలో చెప్పుకుపోసాగాడు.... ''నా పేరు సురేష్. రేఖా నేను ఒకే కాలేజీలో చదువుకున్నాం. ఒకర్నొకరం ప్రేమించుకున్నాం. రేఖకు డాక్టర్ కావాలని వున్నది. నన్నూ డాక్టర్ చదవమన్నది. నేను బ్రైట్ స్టూడెంట్స్ లిస్టులోనే వున్నాను. నాకు సీటు రావడం పెద్ద కష్టం కాదు. రేఖకు విలాస జీవితం అంటే ఇష్టం. ఆమెకు కార్లు కావాలి. ఉండటానికి పెద్ద బంగళా కావాలి. ఇంటి చుట్టూ పూలతోటకూడా కావాలి ఇలా ఎన్నో కబుర్లు చెబుతూ, అలా దాంపత్య జీవితాన్ని తల్చుకుంటూ కలల్లో తేలిపోయేది. నేనంటే చాలా మంది ఆడపిల్లలకు ఇష్టం. అదే రేఖ భయం. పెద్దవాళ్ళు ఎటూ మా పెళ్లి చెయ్యరు. రేఖ బ్రాహ్మణ పిల్ల - నేను వెనుకబడిన తరగతికి చెందిన వాడ్ని. రేఖ తొందరవల్ల ఒకరోజు గుడిలో పూజారి ముందు ఇద్దరం దండలు మార్చుకున్నాం. ఇది జరిగి సంవత్సరం అయింది. ఆతర్వాత

మేము శారీరకంగా కూడా దగ్గర అయ్యాము. ఆమె గర్భ నిరోధక మాత్రలు వాడేది" అగి మంచినీళ్లు అడిగాడు.

గ్లాసుడు మంచినీళ్ళు గడగడ తాగి మళ్ళీ ఆరంభించాడు.

"బి. యస్. సి. పరీక్షలు రాసి నేను మా ఊరు వెళ్ళాను. ఇరవైరోజుల్లో తిరిగి వచ్చాను. మా తల్లిదండ్రులకు మాగురించి చెప్పాను. వాళ్ళు కోడల్ని ఆహ్వానించడానికి సిద్ధంగా ఉన్నారు. నేను ఆ సంతోష వార్త రేఖకు చెప్పడానికి వచ్చాను. అప్పటికి వారం రోజుల క్రిందట రేఖ పెళ్ళి అయిపోయిందనీ, అదీ ఆమె ఇష్టంతోనే జరిగిందనీ విన్నాను. బెనర్జీకి పెద్ద బిజినెస్ వుంది. కారు వుంది. ఆమెకోరిన విలాస జీవితాన్ని అందివ్వగల స్తోమతు అతనికి వుంది" కొంచెం ఆగి నిట్టూర్చాడు.

కళ్ళు ఎర్రగా ఉన్నాయి. అశోక్ శ్రద్ధగా వింటున్నాడు.

"నాభార్య మరొకరితో కాపురం చెయ్యడాన్ని భరించలేక పోయాను. లోకానికి తెలియకపోవచ్చును. కాని ఆమెకు ఆ విషయం తెలుసు. రాత్రింబవళ్ళు ప్రతీకార జ్వాలలు నన్ను దహించసాగాయి. నాకు మనశ్శాంతి కావాలి. ఆమెను చంపితేగాని నాకు మనశ్శాంతి లభించదు. ఆ టైంలో బెనర్జీ ఉండదని నాకుతెలుసు. కరెంటు కూడా లేదు. ఫ్లాటు దగ్గరకు వెళ్ళి కాలింగ్ బెల్ నొక్కాను. వెంటనే తలుపు తెరుచుకుంది. నేను ఒక్క క్షణం ఆలస్యం చెయ్యకుండా లోపలకు వెళ్లి లోపలనుంచి తలుపు వేశాను.

"నువ్వా?" అంటూ నివ్వెరబోయింది రేఖ.

"అవును! నేనే!"

"ఎందు కొచ్చావ్!"

"ఇందుకు! అంటూ ఆమె గొంతు పట్టుకొని నులిపేశాడు. అప్పుడు ఇంట్లో ఎమర్జన్సీ లైటు మాత్రం వెలుగుతున్నది. ఆమె జీవ రహితంగా నా చేతుల్లో నుంచి నేలమీదకు జారిపడింది. అయినా నా కసి తీరలేదు. జీవరహితమైన ఆ శరీరాన్ని అనేక విధాలుగా హింసించాను. చీరతో సీలింగ్‌కు వ్రేలాడ దీశాను. ఎవరికీ అనుమానం రాకుండా ఉండేందుకు ఉత్తరం కూడా రాసి పెట్టాను.''

''మరి ఇప్పుడు స్వయంగా ఎందుకు సరండర్ అయ్యావ్?''

''అశోక్ బాబూ! రేఖను చంపితే నా మనసులో రగులుతున్న జ్వాల చల్లారుతుందనికున్నాను. చంపిన తర్వాత అది మరీ ప్రజ్వరిల్లి నా మనసును దహించి వేస్తున్నది. నాకు బ్రతకాలని లేదు. ఆమెను అసహ్యించుకుంటున్నాను. అయినా ఆమెలేని ఈ లోకంలో నాకు ఉండాలని లేదు. నేను బ్రతికలేను. నన్ను ఉరి తియ్యండి" పిచ్చిగా మాట్లాడసాగాడు.

సురేష్ తండ్రి బెయిల్ కోసం లాయర్ని పెట్టి ప్రయత్నించాడు.

కాని కోర్టులో సురేష్ నో! నో! నాకు బెయిల్ వద్దు. నాభార్యను నేనే హత్యచేశాను. నన్ను శిక్షించండి'' అంటూ అరవ సాగాడు.

అతనికి బెయిల్ యివ్వడం జరగలేదు.

కేసు కలకత్తా కోర్టులో ప్రారంభం అయింది.